ఈ వారపు పెద్దగాథ :



# గాలే వీచకుంటే, చెట్టు కదలాడునా!

పాపినేని ఈశ్వర

కొంచెం మాట దుబారాగానే కానీండి, సూర్య నారాయణరావంతటి పెద్దమనిషి ఆ వూరంతటా గాలించినా కనిపించడన్నే అంటా రందరు !

సాధారణంగా మాటదుబారా అన్నేది కోపం మూలాన, గర్వంమూలాన, అవీగాకుంటే తెలివి తక్కువమూలాన కలుగుతూ వుంటుంది. కాని రావుగారి కందులో ఏయొక్క దుర్గుణం లేదు. అయినా అతడికా పెద్దపేరెలాగో వచ్చిందా వూరిలో. ఔనంటే ఔననే మూఢలోకం— ఎందుకా అన్న విచారమైనా ఎలా కలుగుతుంది దానికి?

అయినా ఏమిటా యిదీ అని తిన్నగా విచారించేవారు లేకపోలేరొకరిద్దరు. వాళ్లకా కారణం బాగానే కనిపిస్తుంది. అది కనిపెట్టి వారా రహస్యాన్ని తమలో తాము దాచిపెట్టేస్తారే కాని నలుగురికి చెప్పివేయరు— చెప్పి, ఒప్పించేందుకు ప్రయత్నించరు. అది వారిలోని లోపం కాదు. తమకు తామె తెలిసికోలేనివారి కది చెప్పినా లాభముండదని తెలిసే వూరకుంటారు. నిజానికి వారలా వూరకుండడమే వివేకత!

రావుగారిలోని లోపమల్లా యిదే— అసలే బుద్ధిమంతుడు, అందులో అనుభవజ్ఞుడు, పైగా ఆరితేరిన న్యాయవాది— ఎదుటివాని వాదంలో లోపాలేవన్నా వుంటే, చిటికెలమీద గ్రహించేస్తాడు. గ్రహించి వూరకోడు. వాటిని సవరించి చెప్తాడా క్షణమందే. అవలీల మహాశాంతంగానే ప్రవర్తిస్తాడు. కాని ఆ యెదుటివాడా చెప్తూన్నది కాస్త గ్రహించి సర్దుకున్నాడా సరి, లేకుంటే మండిపడ్తాడు. అప్పటికయినా శాంతం పోనీడు. తిరగా తిరగా విడదీసి చెప్తాడా లోపాలేవిటో, ఎలా కలుగుతూన్నాయో, ఎలా సరుకోవాలో. అప్పటికే బోధపడదా, వూరకే వుండిపోతాడుకూడా. కాని ఆ యెదుటివాడే గనుక తన తప్పిదం తాను తెలిసిన్నీ, మొండికి దిగి దానిని కప్పివేస్తామని వాదిస్తాడా, అతడోర్పులేదా మీదట. అప్పుడే మొదలెడ్తాడా దుబారా మాటలన్నా. ఎదుటివాడెంతటివాడైనా సరే, దులిపి దూల్చివేసేస్తాడు. అందుకే అతనినలా అనడమూ నలుగురా వూరిలో!

ఒకప్పుడో తమాషా జరిగింది. ఆ యెదురింటాయన ఒక నేరం మోపాడాతని కుమారునిమీద. ఆ కుమారుడు రేపో మాపో మేజరు కాబోయే వయసులో వున్నాడు. ఇంటర్మిడియేటు పరీక్షకు పోబోతూన్నాడా యేడు. అందగాడేనని చెప్పవచ్చు. అయినా ఈకాలం అందగాడు కాని వయసుకాడెవడు లెండి! తలకు తగ్గ క్రాఫింగు, ముఖానికి తగ్గ మీసకట్టు, పొడుగుకు తగ్గ పైజామా, చాతీకి తగ్గ లాల్చీ, కండ్లకు తగ్గ అద్దాలు, కాళ్ళకు తగ్గ స్లిప్పర్లు— ఇవన్నీ సమకూరేటప్పటికా అందంకూడా అబ్బకేడుస్తూ వచ్చి తీరకుంటుందా?

ఇక నాతని గుణం— ఔనా గుణంమాట కదిపితే ఏది ఎలా చెప్పేందుకు వీలుపడదు. ఈ కాలం చదువుకుంటూన్న పడుచువాండ్లు నిండుకుండల్లా తొణికిసలాడరు. వాండ్ల రహస్య ప్రకరణా, లెక్కడో వుంటూన్న బ్రహ్మకైనా తెలియనీయరు కదా, అనుక్షణం తమ వెంబడెంబడే వుండి కలిసిమెలిసి తిరుగుతూన్న ముఖ్యస్నేహితులకైనా తెలియనీయరు. మాకేందుకేవో ముంగ మూసుక్కొంటుంటారు. “మావాడికేమీ తెలీదమ్మా; మావాడికి నవ్వుకుంటే మరో ధ్యాసే లేదమ్మా; అప్పుడేనమ్మా, మావాడికి పెళ్లి ?”— అంటూ పాపమా తల్లులుమురిసి పోతూ వుంటారా కన్నబిడ్డలను

చూచి. ఈలోగా ఎలుకలు, చుంచులు, పందికొక్కులు కూడా త్రవ్వి, కూలిపోతూ వుంటుందా యౌవనం!

నిలకడైన వెడలబాఱని నీళ్ళను నమ్మినైనా నమ్మరాదంటారు — ఈ పడుచువాండ్లనైతే అంతకన్నా నమ్మరాదు! ఇటు ఏమీ తెలియని, ఏ పాపమెఱుగని గోలతనాన వుత్తిచూపులు చూస్తూ వున్నట్లే వుంటారు — అటు వీలయినప్పుడెల్లా మన్మథతాపులను కూడా మించిన ఓరచూపులతో చెప్పరాని చిలిపిపనులు చేస్తూనే వుంటారు. అలాంటి వాండ్లలో వివాహం కావటానికి పూర్వమే మొగధీరులని అనిపించుకోలేని ఒకరిద్దఱు చవటలు! ఎవరో ముసలి దన్నదట, ఏదో వివాహసందర్భంలో — "ఈ కాలపువాండ్లకే తెలియదటమ్మా!" అని. ఇంతకన్నా మహామంత్ర చెప్పేందుకు?—

సరే, ఈ గొడవకేంగాని, రావుగారి అబ్బాయి ఎన్నోవిధాల మంచివాడేనని అనిపించుకుంటూ వున్నాడు. అలాంటి అతడిమీదే నేరం మోపటానికి ఎదురింటాయన.

"ఏమండోయి, రావుగారూ, మీవాడీ మధ్య ఎలా మారిపోతూన్నాడో కనిపెట్టారా?"

"ఎవరు, మావాడా?—ఎలా మారిపోతూన్నాడేమిటి?"

"మా బాగానే-ముందుముందుకు చాలా ప్రయోజకుడవుతాడు లెండి!"

"అదేమిటండోయి, దొంగతనమేమైనా చేశాడా? గోపిడీ చేశాడా? లేకుంటే సారాయేమన్నా సేవించాడా, సాంపిల్ చూదామని?"

"అపాటి అయితే బాగానే వుండేది."

"అయితే కానీయే .చేశాడన్నమాట—ఎరన్నేమిటి? ప్లీడరీ చేస్తూన్నందుకు మంచిపనే పెట్టాడు నారు!"


"అయినా కాని మీరా అబ్బాయి కెందుకు పెండ్లి చేసేయరాదండీ?—మీసాలు కూడా వస్తున్నాయి ముఖం నిండాను!"

"ఓహోహో, మనుమునేరమా ఏమిటి? ఎవర్నోడలు? — ఆ బావగారున్నా?"

"ఈ వేళాకోళాలకేమి గానీండి, రావుగారూ, మీ అబ్బాయి ప్రవర్తనా లేమీ బాగుంటంలేదు. ఈ మధ్య వాడు చాలా చాలా నేర్చాడు. 'ఆడువాండ్లను ఓరచూపులతో చూడ్డం—కన్నుగీటం- వీలయితే చేత్తో పిలవడంకూడా నేర్చాడు. వాణ్ణి మీరు కొప్పడేతీరాలి.' అమీదట—"

"అమీదట ఏమయితే నేమిలెండి! ఇంతకుఅదెల్లా కనిపెట్టగలిగారు మీరు?"

"ఎలాగేమిటండి! మా అమ్మాయినే పిలుస్తూన్నాట్ట వాడు. రెండుమూడు సార్లు కన్నుగీటాట్ట నిన్ననైతే చేయూపూపాట్ట, మేడమీది వసారాలో మా అమ్మాయి నిల్చుంటే.



'రెండుమూడుసారులు కన్నుగీటాట్ట—'

"అటు-ఇటు-అయితే ఇదంతా మీరు కన్నది గాకుండా విన్నదన్నమాట. అంతా విన్నారు గదా, మీరేమి చేశారు?"

"ఏమి చేయాలంటారు? ఈడ్చి వో చెంపపెట్టు పెట్టమన్నారా?"

"ఆ, అలాగే చేయాలి!"

"ఇది మరీ బాగుంది—ఒకరబ్బాయిని మరొకరు కొట్టడం. అప్పుడు మీరూరకుంటారా?"

"ఏమండోయి, శర్మగారూ, నేనన్నదొక్కటి, మీ రర్థం చేసికుంటూన్నది మరొక్కటి. అసలిది మీరు మీ అమ్మాయే చెప్పివుంటుంది. అప్పుడు మీరేమి చేశారని నేనడిగాను. అందుకు మీ రీడ్చి వో చెంపపెట్టు పెట్టమన్నారా అని నన్ను సలహా అడిగారు. ఔనన్నాను నేను. అది మీరు తిన్నగా అర్థం చేసుకోకుండా—"

"అయితే మీరనేదేమిటండీ, మా అమ్మాయినే చెంపపెట్టు పెట్టమనా?"

"అలాగని నే ననలేదు. చెంపపెట్టు పెట్టాలనా అని అడిగితే, పెట్టమని సలహా చెప్పానే కాని!"

"బాగానేవుంది మీరనేది! ఎంతకయినా అడ్వొకేట్లు—మాట సాధించేందులో మీ కెదురు లేదులెండి. అయినా ఇందులో మా అమ్మాయిని మందలించాల్సిన అగత్యమేముందో నాకు తెలీకుంది."



మేడమీద వసారాలో అమ్మాయి నిలుచుంటే—

"ఔనదెలా తెలుస్తుందిలెండి! పరిస్థితులను బట్టి ముందుగా యిది మీకే తెలియవచ్చింది కాని, అదే నాకే గనుక తెలిసివుంటే నేనేమి చేసేవాణ్నో తెలుసా? తిన్నగా మీ వద్దకే వచ్చివుండేవాణ్ణి మీరు మల్లేనే—మీరు మల్లేనే నేనూ కంప్లేంటు చేసేవాణ్ణి—ఏమండోయి, ఇది చూచారా, మీ అమ్మాయి మా అబ్బాయిని చెడగొట్టుతూన్నదంటూ — మీకుమల్లే నేనూ సలహా చెప్పేవాణ్ణి — అయినాగాని, మీ అమ్మాయి కలిదును పెండ్లి చేసేయరాదని; ఈ యిన్ని ఏండ్లు వచ్చాయి, ప్రపంచంకూడా బోధపడుతూన్నది, పైగా ఓరచూపులుకూడా మరగుతూన్న దిప్పుడిప్పుడనికూడా!"

"ఏమండోయి, మీరిలా అనడమేమీ బాగుంటలేదు. మీ అబ్బాయిని మీరు మందలించుకోకుంటే మానేయండి. కాని పొరుగింటి ఆడవాండ్లను దుబారామాటలనడమేమిటండీ—ఓరచూపులని, కోరచూపులనీ?"

"మీరుమాత్రమనడమేమి బాగున్నదండీ, మా అబ్బాయిని—వాడు చెడిపోతూన్నాడని, అది అనీ, ఇది అనీ? ఇంతకు వాడు మొగాడైపోయినా దేన్నేనా యీ గొత్తుపోయడమెల్లా? అసలు

కారణమౌతూన్న ఆ మహాతల్లి ఆడదానినిగూర్చి ఒక్కమాటైనా అనకూడదేం? పాపం!— అయినా మావాడు మీ అమ్మాయిని కన్నుగీటా డన్నందుకు సాక్ష్యమేమిటండి?"

"ఇంకా సాక్ష్యంకూడానా? వాడా కన్ను గీటిందే పెద్ద సాక్ష్యం!"

"ఆపాటి నాకూ తెలుసునులెండి— అన్నం తిన్నందుకు కంచంముందు కూర్చున్నదే సాక్ష్యమంటూ! కాని మావాడు కన్నుగీటాడనేందుకు మాత్రం మీ అమ్మాయి ఓరచూపే ప్రధాన సాక్ష్యం. ఆ ఓరచూపుతో ఆమె వాడినిచూడ కనేవుంటే, వాడా కన్నుగీటిందెలా కనిపిస్తుంది. అసలా కన్నుగీటడమైనా ఎలా సంభవిస్తుందండీ? ఇందుకనే ముందుముందుగా మీ అమ్మాయినే మందలించాలని అంటూన్నా. తప్పంతా అక్కడే వుంటూన్నది. అది కాస్త విడిచేసి మీరెక్కడో వెతికితే ఏం లాభం?"

అప్పటికే శర్మగారి ముఖం కందగడ్డలా ఎఱ్ఱబారింది. ఇప్పుడైతే చెప్పేందుకే వీలుకాదా కోపం— ఆ కోపమున్నూ. చివాలున ఆ కూర్చున్నవాడల్లా లేచి నిలుచున్నాడు.

"అయితే మీరనేదెల్లా ఏమిటండీ, మా అమ్మాయే మీ అబ్బాయిని చూస్తున్నదనా ఓర చూపుల్తో?"

"లేకుంటే మావాడు తనవైపు చూస్తూన్నట్లయినా ఆమెకెలా తెలుస్తుందండి? అసలామె ఇటువైపే చూడకపోతే, వాడయినా ఆమెవైపెందుకు చూస్తాడు? ఇంకా, మీ మాటల్ని బట్టి చూస్తే, ఈ గాథంతా నిన్ననేగాకుండా, కొన్ని దినాలుగా జరిగివస్తూన్నట్లగుపిస్తూన్నది నాకు. మావాడు బూజుకొండని, పత్తిత్తని నేనేమీ వాదించడంలేదు. వాడా పడుచుదనపు కొంటె తనాన మీ అమ్మాయిని చూచేవుంటాడు— చూపుకు చూపుగా ఆ అమ్మాయికూడా వాణ్ణే చూస్తుంటే, ధైర్యంచేసి ఆమీదట చేయూపే వుంటాడు. అయినా, ఎప్పుడయితే ఆ అమ్మాయి కాని ఆ భావం గ్రహించుకున్నదో, అప్పుడే ఇటు వానివైపు చూడ్డం మానేసివుంటుందా, ఈ యింత అనర్థకమే జరిగేదికాదు— అప్పుడే వాడా చూడ్డంకూడా మానేసేవాడు. లేదా, అలాగే


కుష్ఠు ★ బొల్లి

అన్నిరకముల కుష్ఠులకు, బొల్లి వ్యాధులకు, ఇతర చర్మవ్యాధులకు గ్యారంటీగా పనిచేయుచున్నవి.

మా ఔషధ రాజములే!!

క్రొత్తగా అచ్చువేయబడిన మా తెలుగు పెద్ద కేటలాగులు, 10 భాషలలో ముద్రించియున్న కేటలాగులు, యోగ్యతాపత్రములు ఉచితము!

రెడ్డి & కో., (రిజిస్టర్డ్) ★ H. O. గోపాలపురం (వయా) తణుకు, తూ. (గోదావరిజిల్లా)

బ్రాంచ్ ఆఫీసులు:

బెజవాడ గాంధినగరం ★ వాల్తేరు R. S. ★ కటక్ బక్సిబజార్ ★ సికిందరాబాదు 3560 కింగ్స్వే

నెల్లూరు కాపువీధి ★ ఫజిల్‌నగర్ గోరక్‌పూర్

చూస్తూవుంటాడనుకోండి యింకా, రాకురానది సినీమా తెరమీదిబొమ్మలా బాగా అలవాటయిపోయి, ఆమీదట దాన్ని చూచేందుకే విసుగెత్తుతాడు వాడు. లేక, ఇంకా చూస్తూనే వుంటాడంటారా? — వాడు త్తి పిచ్చివాడేకావాలి! ముఖాముఖిగాకుండా అటువైపు తిరిగివున్న ఆడువాండ్లవీపునచేరి కనుసన్నచేసి పిలిచే ఆర్టు మన పడుచువాండ్లింకా సంపాదించలేదు!"

శర్మగారికేమి మాట్లాడేందుకు తోచలేదు. అతని ముఖం మతీమతీ ఎఱ్ఱబారుతూన్నది, క్రోధావేశంతో గిఱ్ఱున తిరిగి పోబోతూ అన్నాడిలా, "అసలు నేనిక్కడికి రావటమే పొరపాటు!"

"ఔను—చాలా పొరపాటు—మాటకు మాటగా మాటాడలేనివారిలా రావటం తప్పక పొరపాటే!"

"ఏమి మాట్లాడాలండీ మీతో? మీ వాణ్ణి వెనకవేసికొని, కన్నవాండ్ల ఆడుబిడ్డలను నోటికి వచ్చినట్లెల్లా ఆడిపోస్తుంటే, ఇంకా మాట్లాడాలట, ఏమిటో!"

"ఇదిగో, శర్మగారూ, మీరలా తొందరపడి కోపగించుకోవడం మంచిది కాదు, నేను మా వాణ్ణి వెనకవేసికొని మాట్లాడుతూన్నానని మీరనుకుంటూన్నారే కాని, మీ అమ్మాయినిగూర్చి మీ రెంత జాగ్రత్తపడుతూన్నారో, అంతకుమించే మా అబ్బాయినిగూర్చి నేనూ జాగ్రత్తపడుతూన్నాను!"

అప్పటికీ శాంతించలేదా శర్మగారు, మతీ మండిపడుతూ అన్నాడు—"ఎంత జాగ్రత్తపడి ఏం లాభం? తప్పంతా మా అమ్మాయిదేనని తీర్చేశారుగా?"

"ఔను—ముమ్మాటికీ అలాగే అంటాను, ఆ గాలే వీచకుంటే, ఈ చెట్టయినా ఎలా కదలాడుతుందండీ!........"

కాని అది సరిగానైనా వినిపించుకోలేదా శర్మగారు, అప్పటికే గుమ్మందాటి, మెట్లుదిగి, వీధిలో అడుగుపెట్టాడు, చివరకు—"గాలీన్నీ-చెట్టున్నూ—ఇందుకే పలుగురలా అంటారు మీ" మ్మని ధుమధుమలాడుతూ వెళ్ళిపోయాడు.

ఇదంతా కచేరీగదిలోనే జరిగింది. అదృష్టాని కప్పుడక్కడ ఎవ్వరూ లేకపోయారు, రావుగారా మీదట ఆ మేజావద్దే కూర్చున్నారు చాలావఱకేదో ఆలోచించుకుంటూ.

అది ఆ సఱుగురు తన్నుగూర్చి ఏమనుకుంటూవున్నారని కాదు, ఆ అనదమేమిటో తనకు తెలియందె లేనా? అబ్బో, దానికేవో లెక్క చేసేట్లయితే, ఈ ప్రపంచంలో తానిక బ్రదుకడం కూడానా?

అతడిప్పుడాలోచించుకుంటూన్న దెల్లా, తన వాదంలో తానేమైనా పొరపడ్డానా అన్నే. ఎదుటి ఆడుది పెడమొగం బెట్టి, ఇవతలి మొగాన్ని ఎంత నిరసించుతూన్నా, 'క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తము' లంటూ లోలోన గుటకలువేసి మ్రింగుతూ, పైపై దాన్నే వేపుగతిగేట్లు దాని చుట్టూ తిరిగి వేధించే విటాగ్రేసరులున్నారు. కాని ఆ రావణాసురులు, ఆ కీచకమహానుభావులు—వారినిగూర్చి తానేమీ అనలేదే, తానన్నదెల్లా ఇప్పుడిప్పుడే తప్పటడుగులు వేస్తూన్న పడుచుతనాన్నిగూర్చే, అసలా వాదానికైనా అదేగా పునాది?

కాలాన్నిబట్టి ప్రపంచం—ప్రపంచాన్నిబట్టి జీవితమన్నారు, ఇలాంటప్పుడు మానవజీవితంలో నాటికి నేటికి ఎన్నెన్ని భేదభావాలు పుట్టాయో మనకు తెలియనివి కావు. నాటి మన స్మృతులు నేడు స్మృతిపథంలోనయినా లేవు—నాటి దేవతలు నేడున్నారో లేదో ఆ స్వర్గాన—ఆ స్వర్గమైనా నేడక్కడే వుంటూన్నదో లేక మరెక్కడికయినా వలసత్రోవే పట్టిందో?

ఆ మాట అలావుంచి, ఈ కాలమాహాత్మ్యం మన ఆడుపిల్లలను పూర్తిగా మార్చేసింది. ఈయన్ని ఫాషెన్లు—ఈ ఫాషెన్లకు తగ్గ పోకడలు—ఈ పోకడలకు తగ్గ మాటలు—ఏ సినీమా భాగ్యనోన్న రానక్కా వచ్చాయి కాని, తోటి దానికైనా వాయల్లే కావాలి కట్టేందుకు—పఫ్ స్లీవ్సు జాకెట్లే కావాలి తొడిగేందుకు—ఏ సత్తుదైనా సరే లోలాకుల జత ఒకటి వుండేతీరాలి! ఇదేమని ఎవరన్నా అడిగితే, 'మీకేనా యివన్నీ? మేము మాత్రం మనుషులముగామా?' అని అంటారే, దీన్నిబట్టే గ్రహించుకోవచ్చు ఎంతైనా!

నిన్న నే చూచిం దెవరో వేయడం ఒక క్రొత్తఫాషెన్‌గా ఆ వైటుసెల్లా, కష్టంమీద

కేర్చి, జడా మెరూడా వేసిందల్లాగే. దానికి తగ్గట్టే వదులుగా అల్లి ముందుకు విడచిందా జడ—లోలాకులు మరోజత మార్చింది క్రొత్తగా—రిష్టువాచీ బిగించి, ఆ చేతికి వుంటూన్న గాజులన్నీ ఆ రెండో చేతికే తొడిగింది—కాళ్లకు హైహీలు షూస్ వేసింది—ఆ వేషానికి తగ్గ ముసిముసి నవ్వుతో, తనలాంటి ఫాషనబుల్ గరల్స్ మరి యిద్దరితో కలిసి పార్కు రోడ్డుమీదుగా సినిమాకు బయలుదేరిందా సాయంకాలం.

మిసమిసలాడుతూన్న నవయౌవనంతో వూడిపడ్డ మన్మథునిలా ఆ ఎదురుగా నడచివస్తూన్నాడో అబ్బాయి. ఆమెను చూచి, ఎవరా యిదీ, సినీస్టారా? అని ఆశ్చర్యపడ్డాడు. కర్మవశాన ఆమెకూడా వాని నప్పుడే చూచింది. చూచి పొంగిపోయింది తన ఫాషన్ వాని నాకర్షించింది గదా అని. నాలుగడుగులు వేసి మళ్ళీ చూచిందట వోరగా, వాడింకా తన్నే చూస్తున్నాడు. ఇలా మెలుకువల్లో మెలుకువల్లా నాలుగయిదు సార్లయినా కలిసి- యాయి ఆ యిరువురి చూపులా యింతలో!

ఆ అమ్మాయి మనసులో మరో కల్తీ లేదు. ఆమె ఆ సర్దా అప్పటికప్పుడే తీర్చిపోయిందా షాషను కంకితంగా. ఇప్పుడామె వానిని గుర్తయినా పట్టలేదు. కాని వానినిమాత్రమా ఓర చూపులతో శ్రీ బిగ్గదేసింది. వాడా రాత్రి సరిగా నిద్రయినా పోతాడో పోడో? మళ్ళానామె ఎవరా అన్న సంశయముతో భోగట్టాతో తీతి పోతుంది. ఆమీదట ఆమెను దార్లుకాయడంతో తీరుబడైనా వుండదు. ఈ యిన్నిటితో వాని ఆ బ్రతుకెలా తెల్లవారుతుందో ఆ దేవుడికే తెలియాలి!

రావుగారి అనుభవదృష్టికి అందిందీ యొక్కటే కాదు—ఇలాంటి వెన్నెన్నో, ఇప్పుడది తన కుమారునే ఆవేశించింది, ఆ పిశాచాన్ని ఎలాగైనా తరిమివేయాలి, ఎలాగా అంటూ ఒకే ఆలోచనలో పడ్డాడతను-

ఇంతలో ఏదో తట్టిందతడికి- తటాలున "పూర్ణా!' అని పిలిచాడు, ఆయొక్క పిలుపుకే ముఖమంతా ఒక్క చిరునవ్వుగా ఇవతలికి వచ్చిందా యిల్లాలు—ఆ అన్నపూర్ణ-

"ఇదిగో, సెలవుతూన్నది, నేను కోర్టుకు పోవాలి కాని, సుబ్బయ్య యిక్కడే వుంటాడు- దారిలో వెంకయ్యకు కూడా చెప్పి పంపుతాను, వాండ్లిద్దరిని పెట్టి, అబ్బాయి గదిలోని సామానులన్నీ నా గదిలోనికి, నా గదిలోని సామానులన్నీ అబ్బాయి గదిలోనికి మార్పించేయి, సాయంకాలానికంతా తయారుకావాలని చెప్పి చేయించు, అవతల చెప్తానులే నీకా కథేమిటో!" అంటూ వెళ్ళిపోయాడా రావుగారు.

సాయంకాలం కోర్టునుండి వచ్చి, క్లబ్బుకు పోయేందుకు తయారవుతూంటే, ఆ అన్నపూర్ణ అన్నదిలా—"ఏమండోయి, మీరే చెప్పండి అబ్బాయితో! నాన్నగారిది చెప్పే వుండరు—నీవే చేయిస్తున్నావిది—ఇంత కాలంగా లేంది ఇప్పుడేమి వచ్చిందని ఒకేవొక పోరు పెడ్తూన్నాడప్పటినుండి, వాడికి వాడి గదే బాగుంటుందట చదువుకునేందుకు"

ఆ అబ్బాయికూడా అక్కడే నిలుచున్నాడా అమ్మ చాటుగా ఏదో పేపరు చూస్తూన్నట్టు- వాని నట్టే చూచి—"లేదురా అబ్బాయి, నేనే చెప్పావలా చేయమని, పరీక్షలు దగ్గరకు వస్తూన్నాయి, వీధివైపు గది చదువు కనుకూలంగా వుండదు, ఎదుట మేడ—క్రింద వీధి—వీండ్లూ వాండ్లూ కనిపించడం రాటన్ డిస్ట్రాక్షన్! వెనుక తోటవైపు గది బహు నిశ్శబ్దంగా వుంటుందని నేనే చెప్పాను" అని అంటూ వెళ్ళిపోయాడా తండ్రి-

దానితో ఆ అబ్బాయి మొగం తెలతెలవారినట్లయింది, గుమ్మడికాయల దొంగ అంటే భుజం తడుముకున్న భావమేదో తొంగిచూస్తున్నదా కండ్లలో! ఆ పోతూన్న తండ్రిని వోరగా చూస్తూ, పుట్టెడనుమానాలతో మాట లేక నిలిచిపోయాడతడు—

అప్పుడు శర్మగారే అక్కడ వుండివుంటే రావుగారి మాటు చురకొంగూర్చి ఇంకా ఏమనగలవాడో కాని, మన శాస్త్రవేత్తలయిన అనుభవజ్ఞులే ఎవరయినా వుండివుంటే, అనేదేమిటో అనే వుంటారు, ఓహోహో అంటూ!

**ANANDAVANI is printed by V. AZIZULLA at Deccan Times Press Madras.**
**and published by V. KALIDAS, at 15 Thambu Chetty Street, Madras.**
Editor: V. KALIDAS, Associate Editors: Andra Seshagiri Rao B.A., Mudda Viswanadham.